క్లుప్తంగా

నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టండి


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ మెనూ ప్రకారమే భోజనం పెట్టాలని తెలిపారు. భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీచెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు


నీర్పాకోటలో ఊరేగుతున్న శ్రీచెంగాళమ్మ ఉత్సవమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీచెంగాళమ్మ దేవత బ్రహ్మోత్సవాల్లో సోమవారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలు భాగంగా శ్రీచెంగాళమ్మ దేవత విగ్రహాన్ని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలోని శ్రీసుబ్రమణ్యం స్వామి, శ్రీవినాయక స్వామి విగ్రహాలను, నవగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీచెంగాళమ్మ దేవత ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి


సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన

సత్యవేడు: మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు(గ్రీన్ అంబాసిడర్స్) వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రమేష్‌తో కలసి కార్మికులు గ్రీవెన్స్‌డేలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. 42 నెలలుగా వేతనాలు అందలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చేసిన పనులకు వేతనాలు ఇప్పటికైనా అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు జి.శేఖర్, వి.మణి, ఆర్ముగం, పి. రత్న, బి.లక్ష్మీ, బాలరాజు, ఎస్.సుబ్రమణి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం


దరఖాస్తులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రమణయ్య

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. 14 సంవత్సరాలు వయస్సు నిండిన వారు విద్యార్హత లేకపోయినా ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లతో ప్రవేశం ఉంటుందన్నారు. రెండేళ్ల ఇంటర్మీడియట్‌ను ఒకే సంవత్సరం పరీక్షలు రాసి పూర్తి చేయవచ్చునని తెలిపారు. వివరాలకు 9502527708 నెంబరుకి ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని డ్రాపవుట్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం


మృతురాలి భర్త భాస్కర్‌కు నగదు అందజేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, బాషా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు గ్రామంలోని దళితవాడకు చెందిన గురవమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం సర్పంచ్ చంద్రశేఖర్, బాషా ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని మృతురాలి భర్త భాస్కర్‌కు అందజేశారు. మృతురాలి కుటుంబం పేదరికంలో ఉండడంతో ఈ నగదు అంత్యక్రియలకు ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామస్తులు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించడంతో మృతురాలి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

తీగలకేమి తెలుసు ఏఎల్‌ఎం లేరని..!

గ్రామీణ ప్రాంతాలు.. రైతులు పొలాలకు విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కరువు.. కారణం .. ట్రాన్స్‌కోలో సిబ్బంది లేమి.. భర్తీకి నోచని కొత్తగా ఉద్యోగ నియమకాలు.. ఖాళీలు.. వెరసి.. కర్షకులు, పల్లెవాసులకు కరెంట్ కష్టాలు.. ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి.. ఫలితం అటు అన్నదాతలు, గ్రామీణులు.. ఇటు ట్రాన్స్‌కో ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. విద్యుత్ తీగలకేమి తెలుసు ఉద్యోగులు లేరని అని చర్చించుకుంటున్నారు.

- విద్యుత్‌శాఖకు అధికారులు కావాలి
- రెండేళ్లుగా భర్తీకాని 8 ఏఎల్‌ఎంలు,
- 6 సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు ఖాళీ
- అస్తవ్యస్తంగా కరెంట్ సరఫరా


వరదయ్యపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్

వరదయ్యపాళెం: మండంలోని విద్యుత్‌శాఖలో భారీగా ఖాళీలు ఉండడంతో కరెంటు సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. ఫలితంగా వినియోగదారులు నిత్యం కరెంటు సమస్యలతో సతమతమవుతున్నారు. స్పందించాల్సిన అధికారులు లేకపోవడంతో ఆ శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా మండలంలోని చిన్న పాండూరు, సంతవేలూరు, చెదులుపాకం, వరదయ్యపాళెంలో సబ్‌స్టేషన్లు ఉండగా, వీటి పరిధిలో 14 వేలకు పైగా గృహ వినియోగ కనెక్షన్లు, 2,153 మంది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ కోసం క్షేత్రస్థాయిలో 16 మంది ఏఎల్‌ఎంలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 8 ఏఎల్‌ఎం పోస్టులు రెండేళ్లకు పైగా ఖాళీగా ఉన్నాయి. సంతవేలూరు, సీఎల్‌ఎస్‌పల్లె, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో ఇద్దరు, కదూరు, చిలమత్తూరు, కంచరపాళెం, తొండంబట్టు ప్రాంతాలకు ఏఎల్‌ఎం పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఏ లోపం వచ్చినా స్పందించే దిక్కులేదు. క్షేత్రస్థాయిలో మండల ట్రాన్స్‌కో ఏఈ చొరవతో ప్రైవేటు సిబ్బంది ద్వారా అత్యవసర సమయాల్లో సమస్యలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అటు సమస్యలపై సకాలంలో స్పందించలేక ఇటు వినియోగదారుల సమస్యల తాకిడికి తట్టుకోలేక మండల విద్యుత్‌శాఖ అధికారి ఒత్తిడికి గురవుతున్నారు.

సంతవేలూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఒకరూ లేరు

సంతవేలూరు సబ్‌స్టేషన్ నుంచి సుమారు 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా కావాల్సి ఉంది. ఇక్కడ ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఏఎల్‌ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్క అధికారి కూడా లేరు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో వరదయ్యపాళెం సబ్‌స్టేషన్ నుంచి అక్కడకు వెళ్లి ఇబ్బందికర పరిస్థితులను అధిగమించాల్సి ఉంది. ఇక్కడ తరచూ లోటల్టేజ్ సమస్య, ఇతర సమస్యలు అత్యధికంగా తలెత్తుతున్నాయి. వ్యవసాయ సీజన్‌లో ఎక్కువగా మోటర్ల ద్వారా సాగునీరు తోడుకునే పరిస్థితి రైతులది. అయితే అక్కడ లైన్‌లలో సమస్యలు, లోటల్టేజ్ సమస్య తలెత్తితే సకాలంలో విద్యుత్‌శాఖ స్పందించలేక పోతోంది. దీంతో రైతులు పంటలకు సాగునీటిని అందించలేక తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను కూడా రెండేళ్లుగా సిబ్బంది కొరత సమస్య వేధిస్తోంది. ఈ విషయమై స్థానిక రైతులు గతంలో నిరసనలు తెలిపినప్పటికీ పోస్టులు మాత్రం భర్తీ కాలేదు.

ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులూ ఖాళీ

మండల పరిధిలో 6 ఎనర్జీ అసిస్టెంట్ల పోస్టులు గత కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయి. గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహించే వీరు మండలంలోని పెద్ద పాండూరు, సంతవేలూరు, సీఎల్‌ఎస్‌పల్లె, వరదయ్యపాళెం, మత్తేరిమిట్ట, మరదవాడ గ్రామ సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కనీసం ఈ పోస్టులైనా భర్తీ అయితే సకాలంలో విద్యుత్ సమస్యలపై దృష్టి సారించేందుకు వీలు అవుతుందని విద్యుత్ అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



వరదయ్యపాళెం మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా మండలంలో చోటుచేసుకునే విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించలేక పోతున్నాం. అన్ని విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-చంద్రా నాయక్, ఏడీఈ, నాగలాపురం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నారాయణవనం: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన నారాయణవనం మేజర్ పంచాయతీవాసులకు చెత్తసేకరణ నిమిత్తం ప్లాస్టిక్ టబ్‌లను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుమన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. పంచాయతీలోని మూడు వేల ఇళ్లకు తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించడానికి రెండేసి ప్లాస్టిక్ టబ్‌లను ఉచితంగా అందిస్తున్నామని ఈఓ షణ్ముగం అన్నారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సత్యవేడు తహసీల్దార్‌గా టీవీ సుబ్రమణ్యం



సత్యవేడు: స్థానిక తహసీల్దార్‌గా టీవీ సుబ్రమణ్యం సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్ మండలంలో పనిచేస్తూ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈ రవి, చంద్ర, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఐ.సుబ్రమణ్యం బాధ్యతల స్వీకరణ



బుచ్చినాయుడుకండ్రిగ: మండల తహసీల్దార్‌గా ఐ. సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురం మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ సుబ్రమణ్యం బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మహ్మద్ పఠాన్ ఆలీఖాన్ వైఎస్‌ఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. మండలంలోని భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సుబ్రమణ్యం తెలిపారు.

పిచ్చాటూరు తహసీల్దార్‌గా రమేష్ బాబు



నాగలాపురం: పిచ్చాటూరు మండల తహసీల్దార్‌గా రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తానని అన్నారు.

వరదయ్యపాళెం తహసీల్దార్‌గా రాజశేఖర్



వరదయ్యపాళెం: మండల తహసీల్దార్‌గా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో అనంతపురం జిల్లాకు వెళ్లారు. తిరిగి తిరుపతి జిల్లాకు రావడంతో ఆయన్ను వరదయ్యపాళెం మండల తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని పేర్కొన్నారు. ఎన్నికల బదిలీల్లో మండలానికి వచ్చిన ఉదయ భారతి సైతం ఆమె సొంత జిల్లాకు వెళ్లింది. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ రాజశేఖర్‌ను వీఆర్‌వోలు, ఆర్‌ఐలు, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

9 నుంచి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 9వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్సవాల్లో రోజూ ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉత్సవమూర్తి ఊరేగింపు జరుగుతుందన్నారు. ఆగస్టు 9న ఉదయం అంకురార్పణ, సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 10వ తేదీ రాత్రి సింహ వాహనం, ఆగస్టు 11న రాత్రి భూత వాహనం, ఆగస్టు 12న రాత్రి శేష వాహనం, ఆగస్టు 13న రాత్రి 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందన్నారు. అనంతరం పులి వాహనంపై స్వామివారు విహరిస్తారని తెలిపారు. ఆగస్టు 14న రాత్రి గజవాహనం, ఆగస్టు 15న మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 7.30కు కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులు రూ.500 చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు. ఆగస్టు 16న సాయంత్రం 5 గంటలకు వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహనం, ఆగస్టు 17న ఉదయం 10 గంటలకు వీరభద్రస్నానం, మధ్యాహ్నం 3 గంటలకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని నాగరాజు తెలిపారు.

బ్లాక్ బోర్డుల వితరణ


బోర్డులు అందజేస్తున్న జూలియన్ రాజు

రేణిగుంట: గిరిజన కాలనీలోని పిల్లలు చదువుకునేందుకు అవసరమైన ఎటువంటి సహాయం చేయడానికైనా ఆషా స్వచ్ఛంద సంస్థ సిద్ధంగా ఉంటుందని సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు. రేణిగుంట మండలం గురవరాజుపల్లె పంచాయతీలోని యానాది కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన రెండు బ్లాక్ బోర్డ్‌లను ఆషా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు సోమవారం ఉపాధ్యాయులకు అందజేశారు. రాజేశ్వరి, సురేష్, వార్డు సభ్యుడు సుబ్బమ్మ పాల్గొన్నారు.

నలుగురికి జరిమానా

నాగలాపురం: పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకటేశ్వర్లు తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై సోమవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఇందులో మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారికి సత్యవేడు కోర్టు మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.40 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


నిందితులతో పోలీసులు

శ్రీకాళహస్తిలో అగ్ని ప్రమాదం



శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారం కూడలి వద్ద సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. నర్తకి బార్ పక్కన ఓ సైకిల్ టైర్ల దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుకాణం మొత్తం కాలిపోయింది. సుమారు రూ.4లక్షలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

మండప దాతలకు అవమానం



బియ్యపు కృష్ణారెడ్డి మండపం (నాడు)



బోర్డు తొలగించిన దృశ్యం (నేడు)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో ఉన్న బియ్యపు కృష్ణారెడ్డి మండపంపై దాతల పేర్లను తొలగించి దాతలను ఆలయాధికారులు అవమానించారు. రాజకీయకక్ష కారణంగా ఆ మండపంపై పేర్లను తొలగించారు. శ్రీకాళహస్తి పట్టణంలో నాలుగు మాడ వీధుల్లో నాలుగు మండపాలున్నాయి. అందులో ఒకటి ఆలయ సమీపంలోని దేవాంగ మండపం, మరొకటి నెహ్రూవీధి, తేరు వీధి మధ్యలో ఉండి కృష్ణారెడ్డి మండపం, మూడోది నెహ్రూవీధి, నగరివీధికి మధ్యలో కైకాల మండపం, నగరివీధి, బజారువీధి మధ్యలో భేరివారి మండపం ఉంది. కైకాలమండపం, భేరివారి మండపం ఇప్పటికీ వారి ఆధీనంలోనే ఉంచుకుని అద్దెలకు ఇచ్చుకుని ఆదాయం పొందుతున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు మాత్రమే సిద్ధం చేస్తున్నారు. మిగిలిన 360 రోజులు వాటికి నిర్వాహకులు అద్దెలు తీసుకుంటున్నారు. అయితే దేవాంగుల మండపం గాలిగోపురం కట్టే సమయంలో తొలగించారు. తొలగించిన తరువాత దానికిప్రతిగా భరద్వాజతీర్థంలో కొంత స్థలాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మిగిలినది బియ్యపు కృష్ణారెడ్డి మండపం. రూ.కోట్ల విలువ చేసే ఈ మండపాన్ని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తాత బియ్యపు కృష్ణారెడ్డి ఏ విధమైన లాభాపేక్ష లేకుండా ఆలయానికి అప్పగించారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బియ్యపు కృష్ణారెడ్డి అనే పేరు కనిపించకూడదని నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నారు ఆ పార్టీ నేతలు. దీంతో ఆలయాధికారులు మండపంపై పేర్లను తొలగించారు. ఇలా కక్షపూరితంగా దాతలను అవమానించడం సరైన పద్ధతి కాదని.. బోర్డు తొలగించినంత మాత్రాన బియ్యపు కృష్ణారెడ్డి మండపం పేరు మారదని.. చరిత్రలో ఆ పేరు ఎప్పటికీ నిలిచిపోతుందని పలువురు అనుకుంటున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, దానిపై బియ్యపు కృష్ణారెడ్డి మండపం అని బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ఇంజినీరింగ్ అధికారులకు కూడా సూచించినట్లు తెలిపారు.

విరాళాల సేకరణ


పాపానాయుడుపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఏర్పేడు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని పాపానాయుడుపేటలో విరాళాల సేకరణ చేశారు. కొండ చరియలు విరిగి పడి సర్వం కోల్పోయిన బాధితుల కోసం తమ వంతుగా విరాళాలు సేకరించి పంపుతామని సీపీఎం జిల్లా నాయకుడు రంగయ్య తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరీముల్లా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


స్థానికులకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ అనిత

వరదయ్యపాళెం: ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిత సూచించారు. సోమవారం ఆమె వైద్య సిబ్బందితో కలిసి మండలంలోని నాగనందాపురంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతకుముందు ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో నివాసాల మధ్య నీటి తొట్టెల్లో నీటి నిల్వలు, ఇళ్ల ముంగిట మురికినీటి నిల్వలు ఉంచరాదని, వాటి కారణంగా క్రిమికీటకాలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సూచించారు. ఎంపీహెచ్ఈఓ రవీంద్రనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

నాగలాపురం: 2024వ సంవత్సరం పిచ్చాటూరు జెడ్పీ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు సోమవారం నగదు బహుమతులు అందజేశారు. అదే పాఠశాలలో 1995–96 బ్యాచ్ చదివిన పూర్వ విద్యార్థి జాకీర్ హుసేన్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున అందించామన్నారు. ప్రతి సంవత్సరం అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇదేవిధంగా ప్రోత్సాహక నగదును బహుమతిని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల 1995–96 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు రియాజ్, కిరుబకరణ్, గిరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి


సీఐతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఏర్పేడు: మతమార్పిడి చేసుకోవాలని మండలంలోని మునగలపాళెంలో ఓ కుటుంబాన్ని బెదిరించిన అన్యమతస్తులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్ వద్ద ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని మునగలపాళెనికి చెందిన పెమ్మసాని వెంకటరమణ నాయుడు భార్య మాధురిని రేణిగుంటకు చెందిన నలుగురు అన్యమతస్తులు నిర్బంధ మతమార్పిడి చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. అనంతరం ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులుకు బీజేపీ నాయకులు సమస్యపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేశాగారం సుబ్రమణ్యంరెడ్డి, వరప్రసాద్, గోపాల్, భాస్కర్, తేజోవతి, డిల్లీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో తనిఖీలు


భక్తులతో మాట్లాడుతున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఉదయం ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మొదట రాహుకేతు మండపాలు, భక్తులు రద్దీగా ఉండే క్యూలు, కంచుగడప, ప్రసాదం కౌంటర్లను పరిశీలించారు. అనంతరం లగేజీ, సెల్‌ఫోన్ కౌంటర్లను తనిఖీ చేశారు. భక్తులకు ఇచ్చే రసీదులను పరిశీలించి, అధిక ధరలు వసూలు చేయకూడదని సిబ్బందిని ఆదేశించారు. భక్తులను సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు కృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి, నాగభూషణంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


వరదయ్యపాళెం: ర్యాలీ చేస్తున్న సిబ్బంది


శ్రీకాళహస్తి రూరల్: గర్భిణులతో సీడీపీఓ,ఏఈఓ

వరదయ్యపాళెం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీఓ దేవకుమారి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కంచరపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై చంటి బిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం కంచరపాళెం వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంపీహెచ్ఈఓ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్ పవనకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వారోత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం సచివాలయ ఏఎస్ఎం అంకమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట లోపు తల్లిపాలను పట్టించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, జమీల, హెల్పర్లు రాధమ్మ, ఆశ పాల్గొన్నారు.

దబ్బాపాలు వద్దు.. ముర్రుపాలే ముద్దు

శ్రీకాళహస్తి రూరల్: పురిటి బిడ్డలకు డబ్బా పాలు కన్నా తల్లిపాలే ఆరోగ్యకరమని సీడీపీఓ శాంతి దుర్గ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వటం శ్రేయస్కరమని అన్నారు. మంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలను పెంచాలని కోరారు. ఎంఈఓ భువనేశ్వరి, సూపర్‌వైజర్ భజావతి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

నారాయణవనం: శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ అన్నారు. సోమవారం మండలంలోని తుంబూరు సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార చార్ట్‌తో ఆహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అన్నారు. ఆరు నెలల తర్వాత అనుబంధ పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను ఇవ్వాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.


తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఏఎస్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది